

ట్యాంకు వద్ద నుంచి నీళ్లు మోసుకెళ్తున్న వృద్ధురాలు



మూడేళ్లుగా అలంకారప్రాయంగా ఉన్న ట్యాంకు, పక్కనే నిరుపయోగంగా పడి ఉన్న పైపులు



ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న విద్యార్థులు

సూరేపల్లిలో సమస్యల లొల్లి

- పాఠశాలకు బస్సు సౌకర్యం లేక 50 మంది విద్యార్థుల అవస్థలు
- రోజూ ఆటోల్లో ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం
- గతంలో పాఠశాల సమయానికి ఉన్న బస్సు నిలిపేసిన ఆర్టీసీ
- ఎస్సీ కాలనీలో మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న నీళ్ల ట్యాంకు
- వీధి కుక్కలతో బెంబేలెత్తుతున్న గ్రామస్తులు
- విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న మిర్చి రైతులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్న గ్రామస్తులు



రోడ్డు పక్కనే పడేసిన వ్యర్థాలు

విలేజ్ వాచ్

కంభం: సూరేపల్లి.. 200 కుటుంబాలు ఉన్న ఈ కుగ్రామాన్ని సమస్యలు చుట్టుముట్టాయి. కంభం మండలం ఎల్.కోట పంచాయతీ పరిధిలోని ఈ గ్రామంలో 520 మంది వరకు నివసిస్తుండగా వీరిలో సుమారు 180 మందికి పైగా ఎస్సీలు ఉన్నారు. గ్రామస్తులను ప్రస్తుతం మంచినీటి సమస్య వేధిస్తోంది. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో రోజూ అవస్థలు పడుతున్నారు. పంట పొలాలకు విద్యుత్ సమస్య, వీధికుక్కల బెడద వేధిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

కంభం నుంచి 5 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామంలో ప్రైమరీ పాఠశాల మాత్రమే ఉంది. పంచాయతీ కేంద్రమైన ఎల్.కోటకు కూడా ఈ గ్రామం 5 కి.మీ దూరంలోనే ఉంటుంది. దీంతో సుమారు 50 మంది విద్యార్థులు కంభంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకే వస్తున్నారు. కంభం నుంచి తర్లుపాడు మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న సూరేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లే సమయానికి బస్సు లేకపోవడంతో నిత్యం ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఆటోలో రోజు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేక ఆ మార్గంలో వెళ్లే వాహనదారులను లిఫ్ట్ కోసం బతిమాలుకుంటున్నారు. గతంలో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు తిరిగేది. కానీ ఆ బస్సులు అధికారులు నిలిపేయడంతో పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల కోసం బస్సును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సీ కాలనీలో నీటి కష్టాలు

గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చేందుకు మూడేళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు నిరుపయోగంగా ఉంది. గతంలో వేసిన రెండు బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం ఓ సింగిల్ ఫేజ్ మోటారులో వచ్చే నీటిని ప్లాస్టిక్ ట్యాంక్‌లో నింపుతుండగా కాలనీ వాసులు బిందెలతో మోసుకెళ్తున్నారు. గతంలో రెండు చోట్ల బోర్లు వేసేందుకు పాయింట్లు గుర్తించిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని కొంత నిధులు వెచ్చించి ఎల్.కోట-నడింపల్లి మధ్యలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి గుడి సమీపంలో బోరు వేస్తే పుష్కలంగా నీరు పడతాయని అక్కడి నుంచి పైపులైన్ ద్వారా ట్యాంక్‌కు నీళ్లు పంప్ చేసి కాలనీకి అందించవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను గతంలో అధికారులు ఆమోదించి ఆ మేరకు చర్యలు చేపడతామని చెప్పినా అది ఆచరణకు నోచుకోలేదు. ఎస్సీ కాలనీలో ఒక్క ఇంటికి కూడా కులాయి లేకపోవడంతో వృద్ధులు, మహిళలు ట్యాంకు వద్ద నుంచి నీరు మోసుకోలేక ఇబ్బంది పడుతున్నారు. జల్ జీవన్ మిషన్ నిధులతో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, పారిశుధ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కరెంటు కష్టాలు.. మిర్చి రైతులకు కన్నీళ్లు

విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వ్యవసాయ బోర్లు పనిచేయకపోవడంతో కోత దశలో ఉన్న మిర్చి పంట ఎండుముఖం పడుతోంది. కంభం మండలంలోని సూరేపల్లిలో సుమారు వంద ఎకరాల వరకు మిర్చి సాగు చేశారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. సూరేపల్లి పంట పొలాలకు జంగంగుంట్ల పరిధి నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతానికి లైన్‌మన్ లేకపోవడంతో విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు పట్టించుకునే నాథుడు కరువయ్యారు. గత నెలలో విద్యుత్ లైన్ సమస్యతో నాలుగైదురోజుల పాటు బోర్లు పనిచేయక పంట ఎండుముఖం పట్టింది. స్థానిక విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు. మళ్లీ ఇప్పుడు కరెంటు సమస్య ఉత్పన్నమైంది. పంట పొలాలకు పురుగు మందు పిచికారీ చేసుకోవాలన్నా నీళ్లు లేవని, పూత, కాపు దశలో ఉన్న మిర్చి పంట మాడు పట్టిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సూరేపల్లిలో ఎండు ముఖం పట్టిన మిర్చి పంట

మంచినీళ్లకు ఇబ్బందిగా ఉంది



తాగునీటికి కోసం రోజూ అవస్థలు పడుతున్నాం. సింగిల్ ఫేజ్ బోరు వద్ద ఉన్న సింటెక్స్ ట్యాంకులో నింపిన నీళ్లను బిందెలతో పట్టుకొని ఇళ్లకు మోసుకుంటున్నాం. కాలనీలో ఏ ఒక్క ఇంటికీ కుళాయి కనెక్షన్ లేదు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మరియమ్మ, ఎస్సీ కాలనీ, సూరేపల్లి

లిఫ్ట్ అడిగి స్కూల్‌కు వెళ్తున్నాం



నేను కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మేము స్కూల్‌కు వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సు లేదు. రోజూ అరగంట ముందే ఇంటి నుంచి వచ్చి రోడ్డుపైన నిలబడుతున్నాం. కంభం వెళ్లే రోడ్డులో బైకులు, స్కూటర్లు వెళ్తుంటే వారిని లిఫ్ట్ అడిగి స్కూల్‌కు పోతున్నాం. ఎప్పుడో ఒకసారి ఆటోలో వెళ్తుంటాం. రోజూ ఆటోలో వెళ్లాలంటే డబ్బులుండాలి కదా. స్కూల్ వదిలిన తర్వాత కూడా ఎవరినైనా లిఫ్ట్ అడిగి ఇంటికి చేరుకుంటున్నాం. మేము స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయంలో ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దారా సన్ని, పదో తరగతి విద్యార్థి, సూరేపల్లి గ్రామం

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



హాజరైన భక్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని జంకె రామిరెడ్డి నగర్‌లో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఉదయం 10 గంటలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల డ్రైఫ్రూట్స్, పూలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణతోపాటు పలువురు పట్టువస్త్రాలు, ముత్యాలు సమర్పించారు. రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆర్‌కేజే నరసింహం, ఏరువ దేవిరెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణ వేదికపై ఉభయదేవేరులతో స్వామివారు

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసతులు కల్పించాలి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో సరైన వసతులు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యాలయంలో రోజూ వందలాదిగా భూముల క్రయవిక్రయాలు సాగుతున్నాయని, అయితే వచ్చిన వారు కూర్చునేందుకు సరైన స్థలం, మరుగు దొడ్ల వసతి లేవని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యాలయం ఆవరణలో వెంటనే వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మా రాముడుయాదవ్, చక్రి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు



నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బేస్తవారిపేట: స్థానిక గీతామందిరం నుంచి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మంచినీటి సరఫరాకు కోసం వేసిన పైపులైన్ శిథిలావస్థకు చేరింది. నిత్యం ఏదో ఒకచోట పగిలిపోతుండటంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేసిన మరుసటి రోజే, ఆ పక్కనే మళ్లీ లీకేజీ ఏర్పడింది. ఇలా సుమారు 60 సార్లు పలు చోట్ల పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా నిత్యం తూతూమంత్రంగా మరమ్మతులు చేయిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తుండటంతో పలుమార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు పంచాయతీ అధికారులు స్పందించారు. పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ఉడుములకు సన్మానం

కొనకనమిట్ల: కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శిరుగూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. పదవి వచ్చేందుకు సహకరించినందులకు కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళి, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఏలూరి సంజీవరెడ్డి, వేమన వెంకటేశ్వరరెడ్డి(ఎంఆర్‌ఎఫ్), సీసీకేఆర్ శ్రీనివాసరెడ్డి, చక్కెర వెలుగొండయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కరుణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉడుములను సన్మానిస్తున్న నాయకులు

గాలిగోపుర నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న ప్రతినిధులు, భక్తులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో వేణుగోపాల స్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణానికి శుక్రవారం కమిటీ ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. పశ్చిమ గోపుర నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజలో వంశపారంపర్య ధర్మకర్త జె.విజయభాస్కర్‌రావు దంపతులు, కె.భాస్కర్‌రావు, కె.పెద్ద శ్రీనివాసులు, రిటైర్డు ఎంఈఓ ఎస్‌సీ కృష్ణారెడ్డి, సీహెచ్ సుబ్రమణ్యం, సత్యసాయి భజన మండలి కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వీరభద్రస్వామి దేవస్థాన ట్రస్టీ ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



గుమ్మా రాజేంద్రప్రసాద్



జనమాల జాన్‌రత్నం

తర్లుపాడు: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడుగా నియమితులైన గుమ్మా రాజేంద్రప్రసాద్, ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నియమితులైన జనమాల జాన్‌రత్నం పేర్కొన్నారు. పార్టీ పెద్దలు తమపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవులకు న్యాయం చేస్తామని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటామని చెప్పారు. పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కనువిప్పు కలిగింది!



నిన్న అలా..



నేడు ఇలా..

- మార్కాపురం చెరువు సప్లయ్ చానల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం చెరువు సప్లయ్ చానల్‌కు నీటిపారుదల శాఖాధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. కాలువలో పేరుకున్న చెత్తా చెదారాన్ని జేసీబీతో తొలగించారు. సప్లయ్ చానల్ పరిస్థితిపై ''ఒకటే కంపు కలగదా కనువిప్పు?'' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత కొన్ని నెలలుగా కాలువను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండింది. ఏబీఎం కాంపౌండ్ చుట్టూ కాలువకు రెండువైపులా ఉన్న కొన్ని వందల కుటుంబాల వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'సాక్షి' ప్రచురించడంతో నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి చెత్త తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని రెండో శనివారం, ఆదివారం అయినప్పటికీ తెరిచి ఉంచుతామని, విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని ఏఈ నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. కోమటికుంట, రాయవరం సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.